

ఇదేం ఇన్‌వాలిడేషన్?

సింగరేణి కార్మికుల మెడికల్ ఇన్ వాలిడేషన్ ప్రక్రియలో అధికారులు నిబంధనలకు పాటించడం లేదనే ఆరోపణలు ఉన్నాయి. 8లో



మావోయిస్టుల జాడ చెప్పండి

మావోయిస్టుల జాడ తెలిస్తే పోలీసులకు సమాచారం అందించాలని పోలీసులు ప్రజలను కోరారు. 8లో

గరిష్టం / కనిష్టం
31°/ 24°

వాతావరణం

జిల్లాలో మంగళవారం ఆకాశం మేఘావృతమై ఉంటుంది. కొన్ని ప్రాంతాల్లో చిరు జల్లులు పడే అవకాశం ఉంది.

మున్సిపల్ కమిషనర్‌తో నేడు సాక్షి ఫోన్ ఇన్

సాక్షి ఫోన్ ఇన్



ఎ.స్వామి, మున్సిపల్ కమిషనర్, పాల్వంచ

పాల్వంచ
సమయం: మంగళవారం మధ్యాహ్నం 3 గంటల నుంచి 4 గంటల వరకు
ఫోన్ నంబర్: **98499 05884**
అంశం: పాల్వంచ పట్టణంలో పారిశుద్ధ్య పరిస్థితి, దోమలు, వ్యాధుల తీవ్రత

న్యూస్‌రీల్

పెద్దమ్మతల్లి హుండీ ఆదాయం రూ.31.56 లక్షలు



కానుకలు లెక్కిస్తున్న ఆలయ సిబ్బంది, భక్తులు

పాల్వంచరూరల్: మండల పరిధిలోని పెద్దమ్మతల్లి ఆలయ హుండీలను సోమవారం లెక్కించారు. 108 రోజులకు గాను రూ.31, 56, 673 ఆదాయం లభించిందని, వీటితో పాటు వివిధ దేశాల కరెన్సీ లభించింది. మిశ్రమ వెండి, బంగారం లభించగా వాటిని సీజ్ చేసి తిరిగి హుండీలో వేసినట్లు ఈఓ రజనీకుమారి తెలిపారు. కార్యక్రమంలో దేవాదాయ శాఖ సూపరింటెండెంట్ పి.భేల్‌సింగ్, ఆలయ కమిటీ చైర్మన్ మహిపతి రామలింగం పాల్గొన్నారు.

మిర్చి రైతులను వేధిస్తున్న తెగుళ్లు



తొలగించిన మిరప మొక్కలు చూపిస్తున్న రైతు లక్ష్మణ్

సుజాతనగర్: ఎన్నో ఆశలతో మిరప సాగు చేసిన రైతులకు ఈ ఏడాది కూడా కష్టాలు తప్పడం లేదు. అకాల వర్షాలో, నకిలీ విత్తనాల ప్రభావమో తెలియదు కానీ మిరప పంటలకు తెగుళ్లు సోకాయి. ప్రధానంగా గుబ్బ రోగం సోకడంతో మొక్కలన్నీ నిలువునా ఎండిపోతున్నాయి. దీంతో దిగుబడి రాదని గుర్తించిన మండలంలోని లక్ష్మక్కపేట గ్రామానికి చెందిన గుగులోత్ లక్ష్మణ్ తదితర రైతులు సోమవారం మొక్కలన్నీ తొలగించారు. లక్ష్మణ్ మూడెకరాల్లో మిరప సాగు చేయగా కాపునకు వచ్చే దశలో తామరపురుగు, నల్లి, తెల్లదోమ, పచ్చదోమల కారణంగా ఎండిపోయే దశకు చేరింది. దీంతో పెట్టుబడి రూ.2లక్షలు నష్టపోతుండగా, చేనులోని మొక్కలను తొలగించాడు. భద్రాద్రి జిల్లాలోని సుజాతనగర్, జూలూరుపాడు తదితర మండలాల్లోనూ ఇదే పరిస్థితి ఉందని రైతులు వాపోతున్నారు.

ప్రపంచ శాంతికి బాటలు వేయాలి

ఐక్యరాజ్యసమితిలో ఖమ్మం వాసి ప్రసంగం

ఖమ్మం మామిళ్లగూడెం: లింగ సమానత్వం ప్రాధాన్యతతో పాటు అణు ఆయుధ నిర్మూలన దిశగా అన్ని దేశాలు ప్రయత్నించడం ద్వారా ప్రపంచ శాంతికి బాటలు వేయాలని డాక్టర్ ఖమ్మంకు ఏలూరి శ్రీనివాస్ కోరారు. న్యూయార్క్‌లోని ఐక్యరాజ్య సమితి ప్రధాన కార్యాలయంలో 'ఐక్యరాజ్య సమితి–సుస్థిర అభివృద్ధి, లక్ష్యాలు' అంశంపై జరిగిన సదస్సులో ఆయన ప్రసంగించారు. మహిళల విద్య, ఆర్థికాభివృద్ధితోనే దేశాల అభివృద్ధికి బాటలు పడతాయని తెలిపారు. అలాగే, ప్రపంచమంతా అణు ఆయుధ నిర్మూలన అత్యవసరమని.. లేకపోతే మానవ జాతి మనుగడ ప్రశ్నార్థకమవుతుందని చెప్పారు. ప్రజలు అణ్వస్త్రాలను కాకుండా అన్న, వస్త్రాలు మాత్రమే కోరుకుంటున్నారని తెలిపారు. అన్ని దేశాలు కలిసి ఒక కాలపరిమితిలో అణు ఆయుధాలు నిర్మూలించాలని కోరారు. ఈసందర్భంగా డాక్టర్ ఏలూరి శ్రీనివాస్‌ను వివిధ దేశాల ప్రతినిధులు అభినందించారు.

నేడు, రేపు పర్యాటక దినోత్సవ వేడుకలు

ఖమ్మం స్పోర్ట్స్: ప్రపంచ పర్యాటక దినోత్సవాన్ని పురస్కరించుకుని మంగళ, బుధ వారాల్లో వేడుకలు నిర్వహించనున్నట్లు ఖమ్మం జిల్లా పర్యాటక శాఖ అధికారి బి.సుమన్‌చక్రవర్తి తెలిపారు. జిల్లా కేంద్రంలోని ఎస్‌ఆర్‌అండ్‌బీజీఎన్‌ఆర్ కళాశాలలో చంద్రయాన్, క్రాఫ్ట్, పెయింటింగ్ అంశాల్లో కళాశాలల విద్యార్థులకు పోటీలు ఉంటాయని పేర్కొన్నారు.

పంచాయితీ ఇక ఢిల్లీలో

కొత్తగూడెం టికెట్ కోసం పట్టుబడుతున్న బీసీ నేతలు

- లంబాడీలకు స్థానం ఎక్కడంటూ అధిష్టానానికి ప్రశ్నలు
- ఢిల్లీకి చేరిన కాంగ్రెస్ ఆశావహుల లొల్లి..



సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం: రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో హస్తం గుర్తుపై పోటీ చేసే అవకాశం దక్కించుకునేందుకు కాంగ్రెస్ నేతలు ఎవరి ప్రయత్నాల్లో వారు ఉన్నారు. పార్టీ పట్ల నిబద్ధత, సామాజిక న్యాయం తదితర అంశాలను పార్టీ పెద్దల ముందు ఉంచుతున్నారు. ఈ క్రమంలో ఢిల్లీ స్థాయిలో తమ వాణి వినిపించే ప్రయత్నం చేస్తున్నారు.

ఏఐసీసీకి విన్నపాలు..

ఈసారి ఎలాగైనా రాష్ట్రంలో అధికారం చేపట్టాలనే లక్ష్యంతో కాంగ్రెస్ పార్టీ నేతలు పావులు కదుపుతున్నారు. అందులో భాగంగా టికెట్ల కేటాయింపు కోసం దరఖాస్తు చేసుకోవాలంటూ ఆశావహులకు సూచించారు. అనంతరం వచ్చిన దరఖాస్తులను వడపోసి జాబితాను ఏఐసీసీ పరిశీలన కోసం ఢిల్లీకి పంపారు. అక్కడ పార్టీ అధిష్టానం నిర్ణయం మేరకు నియోజకవర్గాల వారీగా అభ్యర్థులను ఖరారు చేయనున్నారు. దీంతో కాంగ్రెస్ పార్టీ తరఫున జిల్లాలో పోటీ చేయాలని ఉవ్విళ్లూరుతున్న నాయకులు టికెట్ దక్కించుకునేందుకు చెమటోడ్చుతున్నారు. గల్లీ స్థాయిలో ప్రచారం చేస్తూనే ఢిల్లీ స్థాయిలో తమకు టికెట్ ఇవ్వడానికి గల యోగ్యతలను ఏఐసీసీ పెద్దలకు వివరించే ప్రయత్నాలకు పదును పెట్టారు.

'గూడెం'లో బీసీ మంత్రం

జిల్లాలో ఏకైక జనరల్ స్థానంగా కొత్తగూడెం ఉంది. దీంతో ఇక్కడి నుంచి పోటీ చేసేందుకు కాంగ్రెస్ నేతల మధ్య తీవ్ర పోటీ నెలకొంది. అయితే కొత్తగూడెం స్థానాన్ని బీసీలకు కేటాయించాలనే డిమాండ్ ఇటీవల ఊపందుకుంది. ఈ నేపథ్యంలోనే కేంద్ర మాజీ మంత్రి రేణుకాచౌదరి, ఏఐసీసీ ఓబీసీ నేషనల్ సెక్రటరీ కత్తి వెంకటస్వామి అధ్యక్షతన కొత్తగూడెంలో ఎడవల్లి కృష్ణ సభ నిర్వహించారు. కొత్తగూడెం సీటును బీసీలకు కేటాయించాలనే డిమాండ్‌ను బలంగా వినిపించారు. దీంతో పీసీసీ స్థాయిలో కొత్తగూడెం నుంచి బలమైన బీసీ అభ్యర్థిగా ఎడవల్లి గుర్తింపు పొందారు. అయితే ఇక్కడి నుంచి పోటీ చేసేందుకు ఆసక్తి చూపిస్తున్న టీపీసీసీ సభ్యుడు నాగా సీతారాములు బీసీ వాణికి మద్దతు పలుకుతూనే సామాజిక న్యాయం పేరుతో సరికొత్త వాదనను తెరపైకి తెస్తున్నారు.

మాకో అవకాశం ఇవ్వండి

గడిచిన 30 ఏళ్లుగా కొత్తగూడెం నుంచి బీసీ అభ్యర్థులకే కాంగ్రెస్ పార్టీ తరఫున పోటీ చేసే అవకాశం వస్తున్నా.. ప్రతీసారి కాపు సామాజిక వర్గానికే టికెట్ దక్కిందని సీతారాములు మద్దతుదారులు అంటున్నారు. సామాజిక న్యాయంలో భాగంగా ఈసారి కొత్తగూడెం సీటును బీసీలో ఇతర వర్గాలకు కేటాయించే అంశాన్ని పరిశీలించాలని కోరుతున్నారు. ఈ మేరకు బీసీ నేతలైన మధుయాష్కీ గౌడ్, పొన్నం ప్రభాకర్‌గౌడ్ మద్దతు కోసం ప్రయత్నిస్తున్నారు. బీసీలకు టికెట్ల కేటాయింపు, సామాజిక న్యాయంపై ఏఐసీసీ పెద్దలతో చర్చించేందుకు మధుయాష్కీ బృందం మంగళవారం ఢిల్లీకి వెళ్లనుంది. దీంతో కొత్తగూడెం విషయంలో ఉత్కంఠ నెలకొంది.

ఇల్లెందులో పోటాపోటీ..

రాష్ట్రంలోనే అత్యధికంగా ఇల్లెందు నుంచి పోటీ చేసేందుకు 32 మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకున్నారు. ఈ పేర్లను వడపోసి ఇద్దరు, ముగ్గురు అభ్యర్థుల పేర్లను ఢిల్లీకి పంపినట్టు గాంధీభవన్ వర్గాలు ఇప్పటికే తేల్చిచెప్పాయి. ఈ షార్ట్ లిస్ట్‌లో తమ పేరు ఉందని దరఖాస్తు చేసిన వారిలో సగం మంది నాయకులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. అయితే ఇక్కడ నుంచి పోటీ చేసేందుకు ఆసక్తి చూపిస్తున్న వారిలో జిల్లా పరిషత్ చైర్మన్ కోరం కనకయ్యకు టికెట్ దక్కే అవకాశం ఎక్కువగా ఉన్నట్టు ప్రచారం జరుగుతోంది. దీంతో టికెట్ ఆశిస్తున్న లంబాడా సామాజిక వర్గం నేతలు ఢిల్లీ ఫ్లైట్ ఎక్కారు.

లంబాడీలకే ఇవ్వండి..

జిల్లాలో నాలుగు అసెంబ్లీ స్థానాలు ఎస్టీలకు రిజర్వ్ కాగా, అందులో భద్రాచలం నుంచి సిట్టింగ్ ఎమ్మెల్యే పొదెం వీరయ్య ఉన్నారు. ఇక పినపాక, అశ్వారావుపేట నుంచి కూడా కోయ సామాజిక వర్గం నేతలకే అవకాశం ఎక్కువగా ఉంది. దీంతో కనీసం ఇల్లెందు సీటయినా లంబాడాలకు కేటాయించాలనే డిమాండ్‌ను బలంగా వినిపిస్తున్నారు. అంతేకాదు.. మహబూబాబాద్ లోక్‌సభ నియోజకవర్గ పరిధిని పరిగణనలోకి తీసుకుంటే ఆరు అసెంబ్లీ నియోజకవర్గాలు ఎస్టీ రిజర్వ్‌గా ఉన్నాయి. ఇందులో చెరి మూడు వంతున కోయ, లంబాడాలకు ఇవ్వాలని వారు ఢిల్లీ పెద్దలను కోరుతున్నారు. ఈ మేరకు కామేపల్లి జెడ్పీటీసీ బాణోత్ వెంకట ప్రవీణ్ కుమార్‌నాయక్, ఇస్లావత్ లక్ష్మణ్ నాయక్, బెల్లయ్యనాయక్, బలరాంనాయక్ తదితరులు మూడు రోజుల పాటు ఢిల్లీలో మకాం వేసి తమ గళం వినిపించారు.

జీవితాంతం ప్రజాసేవలోనే..

పట్టాల పంపిణీలో ఎమ్మెల్యే వనమా



మాట్లాడుతున్న ఎమ్మెల్యే వనమా వెంకటేశ్వరరావు

కొత్తగూడెంఅర్బన్: కొత్తగూడెం నియోజకవర్గ ప్రజల కోసం జీవితాంతం సేవ చేస్తూనే ఉంటానని ఎమ్మెల్యే వనమా వెంకటేశ్వరరావు అన్నారు. సోమవారం కొత్తగూడెం క్లబ్‌లో 800 మంది పేదలకు ఇళ్ల స్థలాల పట్టాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వనమా మాట్లాడుతూ.. కొత్తగూడెం ప్రజల కళ్లలో వెలుగులు నింపడమే తన ధ్యేయమని, 800 మంది కళ్లలో ఆనందం చూస్తుంటే జన్మ ధన్యమైనట్లు అనిపిస్తోందని అన్నారు. ఒక్కొక్కరికి 75 గజాల చొప్పున మొత్తం 22 ఎకరాల భూమి కేటాయించామని, దాని విలువ రూ.100 కోట్లు ఉంటుందని తెలిపారు. కొత్తగూడెంలో ఇల్లు లేని ప్రతి పేదవాడికి దశల వారీగా కేటాయిస్తామని, 800 మందికీ గృహలక్ష్మి పథకం కింద ఇళ్లు కట్టిస్తామని హామీ ఇచ్చారు. పట్టణ ప్రజలకు గృహ హక్కు కల్పించామని, సుమారు 10 వేల మందికి క్రమబద్ధీకరణ పట్టాలు పంపిణీ చేశామని చెప్పారు. గతంలో తాను మంత్రిగా ఉన్న సమయంలో పాల్వంచలో 20 కాలనీలు నిర్మించామని గుర్తు చేశారు. బీఆర్ఎస్ ప్రభుత్వంలో కొత్తగూడెం అన్ని విధాలా అభివృద్ధి చెందుతోందని చెప్పారు. ప్రతి గడపకూ సంక్షేమ పథకాలు అందుతున్నాయని తెలిపారు. ఎవరెన్ని కుట్రలు చేసినా రాబోయే ఎన్నికల్లో బీఆర్‌ఎస్‌దే విజయమని జోస్యం చెప్పారు. హైదరాబాద్, సికింద్రాబాద్ తరహాలో కొత్తగూడెం, పాల్వంచను జంట నగరాలుగా తీర్చిదిద్దుతానని తెలిపారు. నియోజకవర్గంలో రూ.3వేల కోట్లతో అభివృద్ధి పనులు సాగుతున్నాయని, 25 కిలోమీటర్ల వరకు సెంట్రల్ లైటింగ్ ఏర్పాటు చేశామని వివరించారు. 800 ఇళ్ల కాలనీకి కేసీఆర్ నగర్‌గా నామకరణం చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ కాపు సీతాలక్ష్మి, మున్సిపల్ వైస్ చైర్మన్ దామోదర్, మార్కెట్ కమిటీ చైర్మన్ భూక్య రాంబాబు, ఆత్మ కమిటీ చైర్మన్ బత్తుల వీరయ్య, ఉర్దూఘర్ చైర్మన్ అన్వర్ పాషా, బీఆర్‌ఎస్ నాయకులు వనమా రాఘవేంద్రరావు, కాసుల వెంకట్, ఎంఏ.రజాక్, భీమా శ్రీధర్, రావి రాంబాబు, యూసఫ్, సుందర్‌రాజు, దుర్గాప్రసాద్, విజయ్, భవాని పాల్గొన్నారు.

గ్యారంటీలు 100 శాతం అమలు చేస్తాం

కర్ణాటక మాజీ మంత్రి పరమేశ్వర్ నాయక్



మాట్లాడుతున్న పరమేశ్వర్‌నాయక్. పక్కన పొదెం వీరయ్య తదితరులు

మణుగూరు టౌన్: కాంగ్రెస్ పార్టీ అధిష్టానం తెలంగాణ రాష్ట్రానికి ఇచ్చిన ఆరు గ్యారంటీలను 100 శాతం అమలు చేస్తామని మహబూబాబాద్ పార్లమెంట్ ఎన్నికల ఇన్‌చార్జి, కర్ణాటక మాజీ మంత్రి పరమేశ్వర్ నాయక్ అన్నారు. సోమవారం ఆయన డీసీసీ అధ్యక్షుడు, భద్రాచలం ఎమ్మెల్యే పొదెం వీరయ్యతో కలిసి మణుగూరులో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ కర్ణాటక రాష్ట్రంలో ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేస్తోందని చెప్పారు. తెలంగాణలోనూ పింఛన్, గృహజ్యోతి, నిరుద్యోగ భృతి, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, రూ.500కే గ్యాస్ సిలెండర్, చేయూత, ఇంటి నిర్మాణానికి రూ.5 లక్షలు వంటి హామీలను కచ్చితంగా అమలు చేస్తామని అన్నారు. వచ్చే ఎన్నికల్లో రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి రావాలని ప్రజలంతా కోరుకుంటున్నారని చెప్పారు. పినపాక నియోజకవర్గంలో కాంగ్రెస్ నుంచి పోటీ చేసేందుకు 17 మంది ఆశావహులు ఉన్నారని, ఎవరికి టికెట్ వచ్చినా అంతా సమన్వయంతో పని చేసి పార్టీ విజయానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో మాజీ ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు, డీసీసీబీ డైరెక్టర్ తుళ్లూరి బ్రహ్మయ్య, నియోజకవర్గ కో–ఆర్డినేటర్ కాటబోయిన నాగేశ్వరరావు, విజయ్‌గాంధీ, పోలెబోయిన శ్రీవాణి, ముద్దరాజు, మైనార్టీ నేత పాషా, వైస్ ఎంపీపీ కేవీ రావు, కొర్సా ఆనంద్ పాల్గొన్నారు.

రామయ్య ఆదాయం రూ.కోటి



హుండీల్లోని నగదు లెక్కిస్తున్న సిబ్బంది

భద్రాచలం: భద్రాచలంలోని శ్రీ సీతారామ చంద్రస్వామి దేవస్థానం హుండీల్లో భక్తులు సమర్పించిన కానుకలను సోమవారం జరిగింది. దేవాదాయ శాఖ, దేవస్థాన అధికారుల ఆధ్వర్యాన హుండీలను తెరిచి చిత్రకూట మండపంలోకి తరలించి లెక్కించారు. ఈ సందర్భంగా 61 రోజులకు గాను రూ.1,07,46,350 ఆదాయం నగదు రూపంలో లభించిందని ఈఓ రమాదేవి వెల్లడించారు. అలాగే, 0.0063 గ్రాముల బంగారం, కేజీ 100 గ్రాముల వెండితో పాటు 136 యూఎస్, 50 ఆస్ట్రేలియా డాలర్లుతో పాటుగా ఇతర విదేశీ నగదు ఆదాయంగా వచ్చిందని పేర్కొన్నారు. ఈ లెక్కింపులో ఆలయ అధికారులు, సిబ్బంది, స్వచ్ఛంద సంస్థ సభ్యులు పాల్గొన్నారు.

హైకోర్టు న్యాయమూర్తి పూజలు..

భద్రాచలంలో శ్రీసీతారామ చంద్రస్వామి వారిని రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి, భద్రాచలం వాసి భీమపాక నగేష్ తన కుటుంబ సభ్యులతో సోమవారం దర్శించుకున్నారు. ఈసందర్భంగా ఆలయ అధికారులు, అర్చకులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలకగా, ఆలయ ప్రదక్షిణ అనంతరం అంతరాలయంలో మూలమూర్తులను దర్శించుకుని, ఉపాలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం పండితులు వేదాశీర్వచనం చేసి స్వామి వారి జ్ఞాపిక అందచేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.



ఆలయంలో కుటుంబ సభ్యులతో హైకోర్టు జడ్జి నగేష్

ముత్తంగి అలంకరణలో స్వామివారి దర్శనం

భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామి వారు ముత్తంగి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ప్రతి సోమవారం స్వామివారిని ఈ రూపంలో అలంకరించడం ప్రత్యేకత. తెల్లవారుజామున గర్భగుడిలో స్వామివారికి సుప్రభాత సేవ, సేవాకాలం, ఆరాధన తదితర పూజలు చేశారు. అనంతరం బేడా మండపంలో కొలువుదీర్చి విశ్వక్సేన పూజ, పుణ్యావాచనం చేశారు. స్వామి వారికి కంకణధారణ, యజ్ఞోపవీత ధారణ, అమ్మవారికి కంకణధారణ, యోక్త్రధారణ గావించి నిత్యకల్యాణ ఘట్టాన్ని ఆలయ అర్చకులు శాస్త్రోక్తంగా నిర్వహించారు.

జడ్జి హారికకు ఘన సన్మానం



హారికను సన్మానిస్తున్న సింగరేణి అధికారులు

ఇల్లెందు: హనుమకొండ జిల్లా కోర్టులో జూనియర్ సివిల్ జడ్జిగా ఎంపికైన ఇల్లుటూరి హారికను సింగరేణి ఇల్లెందు ఏరియా జీఎం జాన్ అబ్రహం సోమవారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇల్లెందు 24 ఏరియాకు చెందిన సింగరేణి ఉద్యోగి లక్ష్మయ్య కుమార్తె హారిక చిన్నతనం నుంచీ సింగరేణి విద్యాసంస్థల్లోనే చదువుకుందని గుర్తుచేశారు. ఎంతో పట్టుదలతో చదివి జూనియర్ సివిల్ జడ్జిగా ఎంపిక కావడం హర్షణీయమని అన్నారు. అనంతరం హారిక తల్లిదండ్రులు లక్ష్మయ్య, సరస్వతిని కూడా జీఎం అభినందించారు. కార్యక్రమంలో అధికారులు మల్లారపు మల్లయ్య, శ్రీనివాస్, గిరిధర్‌రావు, మోహన్‌రావు, నర్సింహారాజు, దిలీప్‌కుమార్, యూసుఫ్, సుధాకర్, శ్రీదేవి పాల్గొన్నారు.

సమస్యలు సత్వరమే పరిష్కరించండి

ప్రజావాణిలో వినతులు స్వీకరించిన అదనపు కలెక్టర్ రాంబాబు



ప్రజావాణిలో సమస్యలు తెలుసుకుంటున్న అదనపు కలెక్టర్

సూపర్‌బజార్(కొత్తగూడెం): ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తులు, ఫిర్యాదుల పరిష్కారానికి సంబంధిత అధికారులు సత్వర చర్యలు చేపట్టాలని అదనపు కలెక్టర్ పి.రాంబాబు అన్నారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణికి వచ్చిన వారి నుంచి దరఖాస్తులు స్వీకరించారు. ఫిర్యాదులను పరిష్కారానికి సంబంధిత అధికారులకు ఎండార్స్ చేశారు. కార్యక్రమంలో డీఆర్‌ఓ రవీంద్రనాథ్ తదితరులు పాల్గొన్నారు.

దరఖాస్తులలో కొన్ని..

- మణుగూరు సుందరయ్య నగర్ కు చెందిన మడికొండ సాధన తన అమ్మమ్మ, తాతయ్యలైన పప్పుల పూలమ్మ, విజయారావు రాసిచ్చిన వీలునామా రద్దు పరుస్తూ ఫోర్జరీ సంతకాలు, ఫొటోలతో బూర్గంపాడు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో దొంగ వీలునామా సృష్టించారని, ఆస్తి కాజేయాలని చూస్తున్న వారిపై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని దరఖాస్తు చేయగా చర్యల నిమిత్తం తహసీల్దార్‌కు ఎండార్స్ చేశారు.
- దుమ్ముగూడం మండలం దబ్బనూతన గ్రామంలో సర్వే నంబర్ 17/2లో 5 ఎకరాల భూమి ఉందని, ఆ భూమి 20 సంవత్సరాలుగా తన పేరున ఉందని, ప్రస్తుతం తానే సాగులో ఉన్నానని, పాత పట్టాదారు పాసు పుస్తకం, అడంగల్ తన పేరు మీద ఉన్నాయని, ఇప్పుడు అక్రమంగా తన భూమిని వేరే వ్యక్తి ధరణిలో నమోదు చేయించుకున్నాడని గ్రామానికి చెందిన కల్లూరి లక్ష్మి ఫిర్యాదు చేయగా తహసీల్దార్‌కు ఎండార్స్ చేశారు.

విష జ్వరాలపై అప్రమత్తంగా ఉండాలి

ఐటీడీఏ పీఓ ప్రతీక్‌జైన్



గిరిజనుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్న పీఓ

భద్రాచలం: ఏజెన్సీలో విషజ్వరాలు ప్రబలుతున్న నేపథ్యాన గిరిజనులు అప్రమత్తంగా ఉండాలని.. ఈవిషయంలో అధికారులు కూడా అవగాహన కల్పించాలని ఐటీడీఏ పీఓ ప్రతీక్‌జైన్ సూచించారు. భద్రాచలంలోని ఐటీడీఏ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన గిరిజన దర్బార్‌లో ఆయన గిరిజనుల నుంచి దరఖాస్తులు స్వీకరించి సమస్యలను తెలుసుకున్నారు. అనంతరం దరఖాస్తులను అధికారులకు వాటిని అందజేసి అర్హులైన వారికి సత్వరమే ప్రభుత్వ పథకాలు మంజూరు చేయాలని ఆదేశించారు. ఈ సందర్భంగా పీఓ మాట్లాడుతూ ప్రజలు విషజ్వరాల బారిన పడకుండా జాగ్రత్త వహించాలని, వైద్యులు గ్రామాల్లో వైద్యశిబిరాలు నిర్వహించాలని సూచించారు. ఐటీడీఏ పరిపాలన అధికారి భీమ్, అధికారులు సురేష్‌బాబు, మునీర్ పాషా, ఆర్.శ్రీనివాస్, ఆదినారాయణ, దుర్గయ్య, హరీశ్‌రావు, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

మార్గదర్శకాలకు లోబడి పరిష్కరించాలి

భద్రాచలంటౌన్: ఓటరు జాబితా సవరణలో వచ్చిన దరఖాస్తులను ఎన్నికల కమిషన్ మార్గదర్శకాల మేరకు పరిష్కరించాలని పీఓ ప్రతీక్ జైన్ అన్నారు. రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వికాస్‌రాజ్ ఎన్నికల ఏర్పాట్లపై కలెక్టర్లు, ఎన్నికల రిటర్నింగ్ అధికారులతో సోమవారం హైదరాబాద్ నుంచి నిర్వహించిన వీసీలో పీఓ పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. జిల్లాలో ప్రతి పోలింగ్ కేంద్రంలో అవసరమైన మౌలిక వసతులను పరిశీలిస్తున్నామని తెలిపారు. దివ్యాంగులు, మహిళల కోసం ప్రత్యేక మోడల్ పోలింగ్ కేంద్రాల ఏర్పాటుకు ప్రతిపాదనలు రూపొందించినట్లు వివరించారు. సమావేశంలో ఎన్నికల పర్యవేక్షకుడు ధారావత్ రామ్‌నాయక్, వివిధ విభాగాల సిబ్బంది పాల్గొన్నారు.

డీసీసీబీలో ఇంటి దొంగలు

- రుణాల మంజూరులో అంతులేని అవినీతి
- ముద్ర రుణాల్లోనూ అక్రమాల పరంపర
- అన్నపురెడ్డిపల్లి బ్రాంచ్‌లో బయటపడిన వైనం
- ముల్కలపల్లి, టేకులపల్లి, మర్లపాడు బ్రాంచ్‌ల్లో కూడా అదే పరిస్థితి
- విచారణకు ప్రత్యేకాధికారుల నియామకం



ఖమ్మంలోని డీసీసీబీ కార్యాలయం

ఖమ్మంవ్యవసాయం: జిల్లా కేంద్ర సహకార బ్యాంక్ (డీసీసీబీ) అవినీతి, అక్రమాలకు అడ్డాగా మారిందనే విమర్శలు వస్తున్నాయి. కొన్నేళ్లుగా బ్యాంకులో అక్రమాలు సర్వసాధారణం కాగా, తవ్విన కొద్దీ ఆనవాళ్లు బయటపడుతున్నాయి. అయితే, చాలా బ్రాంచ్‌ల్లో తప్పులు జరగడానికి అధికారులు, ఉద్యోగులేనని తేలుతుండడం గమనార్హం. డీసీసీబీ ఖమ్మం, భద్రాద్రికొత్తగూడెం జిల్లాలతో పాటు మహబూబాబాద్ జిల్లాలోని బయ్యారం, గార్ల, ములుగు జిల్లాలోని వాజేడు, వెంకటాపురం మండలాల్లో విస్తరించి ఉంది. వంద పీఏసీఎస్‌లు, 50 బ్రాంచ్‌లతో కొనసాగుతున్న డీసీసీబీ ద్వారా పంట రుణాలు, దీర్ఘకాలిక, మధ్య కాలిక రుణాలతో పాటు గృహ, వాహన, బంగారం తాకట్టు, ముద్ర, విద్యా, మార్ట్‌గేజ్ వంటి రుణాలను జారీ చేస్తున్నారు. దాదాపు రూ.3 వేల కోట్ల మేర లావాదేవీలు జరుగుతుండగా, ఏ రుణం కావాలన్నా అధికారులు, ఉద్యోగులకు ఎంతోకొంత ముట్టచెప్పాల్సి వస్తుందనే ప్రచారం జరుగుతోంది. ఇక బ్యాంకు ఉద్యోగుల బంధువులైతే నిబంధనలు పక్కన పెట్టి మరీ రుణాలు ఇస్తున్నారని తెలుస్తోంది.

ఇప్పటివరకు రూ.11కోట్లకు పైగా రుణాలు

చిన్న వ్యాపారులు, స్వయం ఉపాధి పొందే వారి కోసం కేంద్రప్రభుత్వం రూ.50 వేల నుంచి రూ.10 లక్షల వరకు ముద్ర(మైక్రో యూనిట్స్ డెవలప్‌మెంట్ అండ్ రీ ఫైనాన్స్ ఏజెన్సీ) పేరిట రుణాలు ఇస్తోంది. పేద, మధ్య తరగతి వర్గాలను దృష్టిలో పెట్టుకుని రూపొందించిన ఈ పథకం ద్వారా రుణాల పంపిణీలోనూ డీసీసీబీల్లో అక్రమాలు జరుగుతున్నాయి. 2019 జనవరి 2 నుంచి డీసీసీబీలో ముద్ర రుణాలు ఇస్తుండగా, ఇప్పటివరకు 4,245 మందికి రూ.17,11,77,452 మేర రుణాలు ఇచ్చారు. ఈ ఏడాది ఇప్పటి వరకు 878 మందికి రూ. 5.60 కోట్లు ఇచ్చినట్లు అధికారిక సమాచారం. అయితే, పలు బ్రాంచ్‌ల్లో ముద్ర రుణాల జారీ సందర్భంగా అక్రమాలు జరిగినట్లు గుర్తించారు. అన్నపురెడ్డిపల్లి బ్రాంచిలో మేనేజర్ నాగభూషణం ఇష్టారాజ్యంగా తన కుటుంబీకులు, పని వారితో పాటు ఇతర ప్రాంతాల వారికి నిబంధనలకు విరుద్ధంగా రూ.లక్షల్లో రుణాలు ఇచ్చి అడ్డంగా దొరికిపోయారు. ఈ వ్యవహారంపై ఖమ్మం డీసీసీబీకి చెందిన ఏజీఎం కృష్ణమోహన్ విచారణ జరిపి నివేదిక సమర్పించగా నాగభూషణంను సస్పెండ్ చేశారు. ఈ బ్రాంచ్‌లో దాదాపు రూ.1.76 కోట్ల మేర ముద్ర రుణాల్లో అక్రమాలు జరిగినట్లు సమాచారం. ఇదిలా ఉండగా, ముల్కలపల్లి, టేకులపల్లి, మర్లపాడు బ్రాంచ్‌ల్లోనూ ముద్ర రుణాల పంపిణీ సందర్భంగా అక్రమాలు జరిగినట్లు ఆరోపణలొస్తున్నాయి. ఈ ఏడాది ముల్కలపల్లి బ్రాంచ్‌లో 31 మందికి రూ.16.24 లక్షలు, టేకులపల్లి బ్రాంచ్‌లో 44 మందికి రూ.63 లక్షలు, మర్లపాడు బ్రాంచ్‌లో 23 మందికి రూ.32 లక్షలు రుణాలుగా ఇచ్చారు. ఇవేకాక గతంలో ఇచ్చిన రుణాల్లోనూ అక్రమాలు జరిగినట్లు ప్రచారం జరుగుతోంది.

ప్రత్యేకాధికారులతో విచారణ

అన్నపురెడ్డిపల్లి బ్రాంచ్‌లో జరిగిన అక్రమాలపై ఇప్పటికే విచారణ పూర్తయింది. ఇక ముల్కలపల్లి బ్రాంచ్ కు డీజీఎం ఉపేందర్, టేకులపల్లి బ్రాంచ్‌కు ఏజీఎం వెంకటేశ్వర్లు, మర్లపాడు బ్రాంచ్‌కు అజయ్‌రెడ్డిని విచారణ అధికారులుగా నియమించారు. ఈ బ్రాంచ్‌ల్లోనూ భారీగానే అక్రమాలు జరిగినట్లు తెలుస్తుండగా విచారణ అనంతరం అసలు లెక్క తేలనుంది. కాగా, బ్రాంచ్‌ల్లో ఉద్యోగుల అవినీతి వెనుక కొందరు ఉన్నతాధికారుల ప్రమేయం కూడా ఉన్నట్లు డీసీసీబీలో చర్చ జరుగుతోంది.

విచారణ జరిపిస్తున్నాం...



ముద్ర రుణాల మంజూరు సందర్భంగా పలు బ్రాంచ్‌ల్లో అక్రమాలు జరిగినట్లు ఆరోపణలు వచ్చాయి. దీంతో విచారించేందుకు అధికారులను నియమించాం. ఇప్పటికే అన్నపురెడ్డిపల్లి బ్రాంచ్ మేనేజర్‌ను సస్పెండ్ చేశాం. అధికారులు, ఉద్యోగులు అక్రమాలకు పాల్పడినట్లు తేలితే సహించేది లేదు.

– అట్లూరి వీరబాబు, సీఈఓ, డీసీసీబీ

క్లుప్తంగా

ఘనంగా పండిట్ దీన్ దయాళ్ జయంతి


నివాళులర్పిస్తున్న రంగాకిరణ్, నాయకులు

చుంచుపల్లి: కొత్తగూడెంలోని బీజేపీ జిల్లా కార్యాలయంలో సోమవారం పండిట్ దీన్ దయాళ్ ఉపాధ్యాయ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కె.వి.రంగాకిరణ్ మాట్లాడుతూ పండిట్ దీన్ దయాళ్ ఉపాధ్యాయ 1951లో రాజకీయ క్షేత్రం భారతీయ జనసంఘ్‌లో ప్రచారకులుగా చేరారని, ఆ పార్టీ అఖిల భారత ప్రధాన కార్యదర్శిగా దేశ వ్యాప్తంగా విస్తరణలో క్రియాశీలక పాత్ర పోషించారని అన్నారు. ఆయన చేసిన సేవలు మరువలేనివని కొనియాడారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా జనరల్ సెక్రటరీ యడ్లపల్లి శ్రీనివాస్, లక్ష్మీదేవిపల్లి, చుంచుపల్లి మండలాల అధ్యక్షులు పైడిపాటి రవీందర్, రాయుడు నాగేశ్వరరావు, ఓబీసీ మోర్చా జిల్లా కోశాధికారి జల్లారావు శ్రీనివాస్ రావు, ఎస్సీ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కటికాల రంజిత్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

మెనూ ప్రకారం పౌష్టికాహారం అందించాలి

ఐటీడీఏ ఏపీఓ జనరల్ డేవిడ్‌రాజ్


జూమ్ మీటింగ్‌లో మాట్లాడుతున్న డేవిడ్ రాజ్

భద్రాచలం: గిరిజన సంక్షేమ శాఖ గురుకుల కళాశాల, పాఠశాలలు, ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు మెనూ ప్రకారం పౌష్టికాహారం అందేలా ప్రిన్సిపాళ్లు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని గురుకులాల ఇన్‌చార్జ్ ఆర్‌సీఓ డేవిడ్ రాజ్ అన్నారు. సోమవారం తన చాంబర్ నుంచి ప్రిన్సిపాళ్లతో జూమ్ మీటింగ్ నిర్వహించారు. విద్యార్థుల ఆరోగ్య పరిరక్షణకు తీసుకుంటున్న చర్యలపై సమీక్షించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. గురుకుల పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థుల డైట్‌కు సంబంధించిన ప్రతి అంశాన్ని పరిగణనలోకి తీసుకుని మెనూ ప్రకారం భోజనం అందించాలని సూచించారు. నిర్లక్ష్యం చేస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. సమావేశంలో గురుకులం ఏఓ నరేందర్ రావు, గణేష్ తదితరులు పాల్గొన్నారు.

అక్రమంగా తరలిస్తున్న పశువుల పట్టివేత

బూర్గంపాడు: అక్రమంగా తరలిస్తున్న ఐదు పశువులను సోమవారం బూర్గంపాడు పోలీసులు పట్టుకున్నారు. పశువుల తరలింపు సమాచారంతో ఎస్సై రాజ్‌కుమార్ మోరంపల్లిబంజర వద్ద తనిఖీలు చేపట్టారు. ఓ వాహనంలో అనుమతి లేకుండా తరలిస్తున్న ఐదు ఆవులను పట్టుకుని పాల్వంచలోని గోశాలకు తరలించారు. పశువుల అక్రమ రవాణాకు పాల్పడిన సూర్యాపేట జిల్లా మునగాలకు చెందిన రవికుమార్‌ను అదుపులోకి తీసుకుని కేసు దర్యాప్తు చేస్తున్నారు.

సినీ ఫక్కీలో పరారీ

దుమ్ముగూడెం : మండలానికి చెందిన ఓ వ్యక్తి తరచూ చోరీలకు పాల్పడుతుంటాడు. ఓ కేసులో జైలుకు వెళ్లి తిరిగి వచ్చాక కూడా అదే పనిగా చోరీలు చేస్తున్నాడు. దీంతో పోలీసులు అతడిపై ప్రత్యేక నిఘా పెట్టారు. ఈ క్రమంలో సోమవారం చర్ల వైపు నుంచి లక్ష్మీనగరం వైపు వస్తున్నాడనే సమాచారంతో సీఐ దోమల రమేష్ ఆధ్వర్యంలో ములకపాడు వద్ద సిబ్బందిని ఏర్పాటు చేశారు. కాగా, ద్విచక్ర వాహనంపై వేగంగా వస్తున్న అతడు.. ములకపాడు వద్దకు రాగానే పోలీసులను గమనించి వాహనాన్ని అక్కడే వదిలేసి పరుగు తీశాడు. పోలీసులు వెంటపడినా అచూకీ లభించలేదు. దీంతో పోలీసులు వెనుదిరిగారు. కాగా, ఈ ఘటన ములకపాడు ప్రాంతంలో అలజడి సృష్టించింది.

హౌసింగ్ బోర్డులో చోరీ

చుంచుపల్లి: చుంచుపల్లి హౌసింగ్ బోర్డు కాలనీలో తాళం వేసి ఉన్న ఓ ఇంట్లో చోరీ జరిగిన ఘటన సోమవారం చోటుచేసుకుంది. కాలనీలో నివాసం ఉంటున్న సింగరేణి రిటైర్డ్ ఉద్యోగి లూథర్ రవికుమార్ ఈనెల 21న ఇంటికి తాళం వేసి హైదరాబాద్ వెళ్లారు. సోమవారం తిరిగి వచ్చాక ఇంట్లో చోరీ జరిగిన విషయాన్ని గుర్తించారు. తులానికి పైగా బంగారం అపహరణకు గురైందని పోలీసులకు పిర్యాదు చేశారు.

బాయిలర్ పేలిన డెయిరీలో తనిఖీలు

ఖమ్మంఅర్బన్: ఖమ్మం 8వ డివిజన్ గోపాలపురంలోని ఒక ప్రైవేట్ డెయిరీలో ఇటీవల బాయిలర్ పేలగా అధికారులు విచారణ ముమ్మరం చేశారు. ఘటన జరిగిన రోజు ఫుడ్ ఇన్‌స్పెక్టర్ తనిఖీ చేసి యజమాని అందుబాటులో లేరు. దీంతో సోమవారం తాళం తీయించిన ఫుడ్ ఇన్‌స్పెక్టర్ కిరణ్‌కుమార్ డెయిరీ పరిసరాలను పరిశీలించారు. గతంలో ఫుడ్ సేఫ్టీ లైసెన్స్ తీసుకున్నా గడువు దాటాక రెన్యువల్ చేసుకోలేదని గుర్తించారు. అనంతరం డెయిరీలో పాలు, పాల ఉత్పత్తుల శాంపిల్స్ సేకరించిన ఫుడ్ ఇన్‌స్పెక్టర్ మాట్లాడుతూ ల్యాబ్ నుంచి వచ్చే నివేదిక ఆధారంగా చర్యలు తీసుకుంటామని తెలిపారు.

ఇదేం ఇన్‌వాలిడేషన్ ?


కొత్తగూడెంలోని సింగరేణి ప్రధాన ఆస్పత్రి

- అనారోగ్యానికి గురైనా అన్‌ఫిట్ చేయరా..
- అధికారుల వైఖరిపై కార్మికుల్లో ఆందోళన
- కేసీఆర్ ఆదేశాలు బేఖాతర్ చేస్తున్న వైద్యులు
- సీఎంఓ ఆధ్వర్యంలో నేడు, రేపు మెడికల్ బోర్డు

సింగరేణి (కొత్తగూడెం): సింగరేణి కార్మికుల సౌకర్యార్థం నిర్వహిస్తున్న మెడికల్ ఇన్ వాలిడేషన్ ప్రక్రియ గందరగోళంగా మారింది. సంస్థలో 30, 40 ఏళ్లుగా పనిచేసిన కార్మికులు శరీరంలో సత్తువ కోల్పోయి, గనుల్లో వెలువడే విష వాయువుల కారణంగా అనారోగ్యాల పాలవుతున్నారు. ఈ క్రమంలో వారిని అన్‌ఫిట్ చేసి కుటుంబంలో ఒకరికి ఉద్యోగం కల్పిస్తామని సీఎం కేసీఆర్ శ్రీరాంపూర్ సభలో ప్రకటించారు. గతంలో ఆరు వ్యాధులకు మాత్రమే ఇన్‌వాలిడేషన్‌కు దరఖాస్తు చేసుకోగా, ఇటీవల మరో 10 రకాల జబ్బులను జోడించి మొత్తం 16 రకాల వ్యాధులున్న వారికి అవకాశం కల్పించారు. ఉద్యోగ విరమణకు కనీసం రెండేళ్ల సమయం ఉన్నవారు అర్హులని ప్రకటించారు. అయితే అధికారులు ఆ నిబంధనలకు నీళ్లొదులుతున్నారని కార్మికులు అంటున్నారు. ఇష్టమైన వారినే అన్‌ఫిట్ చేస్తున్నారని వాపోతున్నారు. మెడికల్ బోర్డుకు ముందే అధికారులను కలిసి ముడుపులు ముట్టజెప్పిన వారికి అవకాశం కల్పిస్తున్నారని ఆరోపిస్తున్నారు. తాము బీపీ, షుగర్, కిడ్నీ, హృద్రోగ సమస్యలతో బాధ పడుతున్నామని చెబితే మెడికల్ బోర్డులో పరీక్షించిన డాక్టర్లు సానుకూలంగా ఉన్నా.. జాబితా విడుదలలో ఆ పేర్లు ఉండడం లేదని అంటున్నారు.

రిపోర్టుల ఆధారంగా అంటే సరికాదు..

సింగరేణిలో మెడికల్ ఇన్‌వాలిడేషన్ ప్రక్రియ మెడికల్ రిపోర్టు ప్రకారమే జరుగుతుంది. కంటి జబ్బులు, కేన్సర్, గుండెపోటు, పక్షవాతం వంటి జబ్బులు మాత్రమే రిపోర్టుల ద్వారా తెలుస్తుంది. కానీ బీపీ, షుగర్ వంటివి తగ్గుతూ, పెరుగుతూ ఉంటాయి. ఇలాంటి వారిని అధికారులు అన్‌ఫిట్ చేయడం లేదని, విధి నిర్వహణలో ఈ జబ్బులు పెరిగితే ఎవరు బాధ్యులని కార్మికులు ప్రశ్నిస్తున్నారు. సాధారణంగా గనుల్లో 30 సంవత్సరాలు పనిచేసిన కార్మికులు.. ఆ తర్వాత పని చేయడం కష్టమనే విషయం అందరికీ తెలిసిందే. గనుల్లోని బొగ్గు పొరల్లో నుంచి వెలువడే విష వాయువులు కార్మికుల జీవన ప్రమాణాన్ని తగ్గిస్తాయి. ఈ క్రమంలో 30 ఏళ్ల సర్వీసు పూర్తి చేసిన వారిని మెడికల్ బోర్డు ద్వారా అన్‌ఫిట్ చేయాలని కార్మికులు కోరుతున్నారు.

నేడు, రేపు మెడికల్ బోర్డు..

సింగరేణి కార్మికులు ఎప్పుడెప్పుడా అని ఎదురుచూస్తున్న మెడికల్ బోర్డు ఈనెల 26, 27 తేదీల్లో కొత్త సీఎంఓ ఆధ్వర్యంలో జరగనుంది. గత సీఎంఓ మందా శ్రీనివాస్ సమక్షంలో నెలకు రెండు, మూడు సార్లు మెడికల్ బోర్డులు నిర్వహించి దరఖాస్తుదారుల్లో 60 నుంచి 70 శాతం మేర ఇన్‌వాలిడేషన్ చేసేవారు. కాగా, డిప్యూటీ సీఎంఓ సుజాతకు యాజమాన్యం గతనెలలో సీఎంఓ బాధ్యతలు అప్పగించింది. ఆమె ఆధ్వర్యంలో నేటి నుంచి జరిగే బోర్డులో ఏ మేరకు అన్‌ఫిట్ చేస్తారో వేచి చూడాలి.

నిబంధనలకు నీళ్లు..

సింగరేణి సంస్థ నిర్వహించే కార్పొరేట్ మెడికల్ బోర్డ్‌కు దరఖాస్తు చేసుకోవాలంటే సదరు కార్మికుడు నిర్దిష్ట 16 జబ్బుల్లో ఏదో ఒకదాంతో ఆరు మాసాలుగా బాధ పడుతుండాలి. కానీ మెడికల్ బోర్డుకు ఒకటి రెండు రోజుల ముందు డ్యూటీ చేసిన వారు కూడా అన్‌ఫిట్ అవుతున్నారంటే అధికారులు ఏ మేరకు నిబంధనలు పాటిస్తున్నారో తెలుస్తోందని కార్మికులు అంటున్నారు. పక్షవాతం తదితర జబ్బులతో ఇన్‌వాలిడేషన్ అయిన కార్మికుల ఇళ్లకు వెళ్లి సింగరేణి విజిలెన్స్ విభాగం వారు తనిఖీలు చేస్తున్నారని, మరి రెండు రోజుల ముందు విధులు నిర్వహించిన వారి గురించి ఎందుకు పట్టించుకోరని ప్రశ్నిస్తున్నారు. కాగా, సింగరేణి కార్మికుల కోసం ఏర్పాటుచేసిన మెడికల్ బోర్డు మంత్రులు, కొందరు నాయకుల పాలిట వరంగా మారిందనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. వారు చెప్పినవారిని అధికారులు అన్‌ఫిట్ చేస్తున్నారని, అయితే వారి అనుచరులు భారీగా డబ్బు వసూలు చేస్తున్నారని కార్మికులు వాపోతున్నారు.

హైదరాబాద్ డాక్టర్లు అవసరం లేదు



కార్మికుడు జబ్బుతో ఏ మేరకు బాధపడుతున్నాడో తేల్చని వైద్యులను మెడికల్ బోర్డుకు ఎందుకు పిలుస్తున్నారో తెలియడం లేదు. బోర్డులో కూర్చున్న వైద్యులు జబ్బు వివరాలు తేల్చకుండా హయ్యర్ రిఫరల్‌కు పంపిస్తే కార్పొరేట్ ఆస్పత్రుల వైద్యులు అన్‌ఫిటా కాదా అని చెబుతున్నారు. ఈ క్రమంలో అక్రమాలు జరుగుతున్నాయి. ఇలా కాకుండా గతంలో వలె సింగరేణి వైద్యులే నిర్ధారణ చేయాలి. అప్పుడే అర్హులైన కార్మికులకు న్యాయం జరుగుతుంది.

– రియాజ్ అహ్మద్, హెచ్‌ఎంఎస్ జనరల్ సెక్రటరీ

అక్రమాలకు తావులేదు



మెడికల్ బోర్డ్‌లో అక్రమాలకు తావులేదు. గతంలో ఉన్న సిబ్బందిని మార్చి ఎప్పటికప్పుడు కొత్తవారిని నియమిస్తూ, సమాచారాన్ని గోప్యంగా ఉంచుతున్నాం. కార్మికుల జాబితా అందరికీ కాకుండా బోర్డ్‌కు వచ్చేవారికే పంపిస్తున్నాం. మెడికల్ బోర్డ్ పర్యవేక్షణను ఏసీబీకి అప్పగించాం. కార్మికులకు ఉన్న జబ్బుల వివరాలు సిస్టమ్‌లో అప్‌లోడ్ చేస్తున్నాం. బోర్డ్ సమయంలో ప్రైవేట్ లాడ్జీల వద్ద సింగరేణి విజిలెన్స్ అధికారులతో నిఘా ఏర్పాటు చేస్తాం.

– ఎస్.బలరామ్, డైరెక్టర్ (పా)

కేటీపీఎస్ బూడిద టన్ను రూ.30


కేటీపీఎస్‌లోని యాష్ పాండ్

- జెన్‌కోతో బ్రిక్ ఫ్యాక్టరీల యజమానుల ఒప్పందం
- దళారులకు చెక్ పెట్టేలా పలు మార్పులు

పాల్వంచ: పాల్వంచలోని కేటీపీఎస్ నుండి వెలువడే బూడిద(యాష్) స్థానిక బ్రిక్ ఫ్యాక్టరీలకు అందించేందుకు నిర్ణయించారు. ఇందుకోసం టన్నుకు రూ.30గా ధర అంగీకారం కుదిరింది. ఈమేరకు జెన్‌కో ఉన్నతాధికారుల వద్ద స్థానిక ఫ్యాక్టరీల యజమానుల సంఘం ఒప్పందం చేసుకున్నారు. గతంలో స్థానిక ఫ్యాక్టరీలకు ఉచితంగా బూడిద అందించేవారు. అయితే బహిరంగ మార్కెట్‌లో బూడిదకు అధిక ధర పలుకుతుండటంతో గత మార్చి నుండి నిలిపేశారు. ఈక్రమంలో బూడిదపైనే ఆధారపడిన కొత్తగూడెం, పాల్వంచ చుట్టుపక్కల ఫ్యాక్టరీల యజమానులు ఆందోళనకు గురయ్యారు. చిన్న తరహా ఫ్యాక్టరీలకు ప్రోత్సాహం కరువైందని ఆవేదన వ్యక్తమైంది. మరోవైపు ఇటుకల తయారీకి ఉపయోగించే జిప్సం, సున్నం రేట్లు కూడా పెరగగా ఇటుక తయారీ, అమ్మకాలు పడిపోయి తయారీదారులు నష్టాలు చవిచూడాల్సి వచ్చింది.

రూ.10 నుంచి మొదలు

బూడిదను ఉచితంగా ఇచ్చేందుకు జెన్‌కో యాజమాన్యం ససేమిరా అనడంతో ఫ్యాక్టరీల నిర్వాహకులు అతి తక్కువ ధరకు ఇవ్వాలని సీఎండి డి.ప్రభాకర్ రావును కోరారు. తొలుత టన్ను ధర రూ.10కి ఇవ్వాలని కోరుతూ చర్చలు జరిపారు. చివరకు టన్ను ధర రూ.30గా నిర్ణయించడంతో అంగీకారం కుదుర్చుకున్నారు. ఈమేరకు జెనకో ఫైనాన్స్, హెచ్‌ఆర్ డైరెక్టర్ల వద్ద ఒప్పందం కుదరడంతో ఆదేశాలు జారీ అయ్యాయి. కాగా, గత మార్చిలో ఉచితంగా బూడిద సరఫరా నిలిచిపోవడంతో అనేక ఫ్యాక్టరీలు మూతబడగా, ప్రస్తుతం 34 మాత్రమే నడుస్తున్నట్లు సమాచారం. కాగా, కొందరు దళారులు సైతం ఫ్యాక్టరీల పేరిట ఉచితంగా బూడిదను తీసుకెళ్లి అమ్ముకుంటున్నట్లు తెలియడంతోనే జెన్‌కో యాజమాన్యం కనీస ధర నిర్ణయించినట్లు తెలిసింది. అంతేకాకుండా ఇక నుంచి ఫ్యాక్టరీ యజమానుల పూర్తి వివరాలు, జీఎస్టీ, పాన్‌కార్డు, ప్లాంట్ అనుమతి తదితర పత్రాలు స్వీకరించాకే బూడిద తరలింపునకు అనుమతి ఇవ్వనున్నట్లు సమాచారం. ఈవిషయమై కేటీపీఎస్ 5, 6వ దశల సీఈ ఎం.ప్రభాకర్ రావును వివరణ కోరగా బూడిద కేటాయింపుపై ఉన్నతాధికారుల నుండి ఆదేశాలు అందాయని తెలిపారు. ఫ్యాక్టరీల నిర్వాహకుల నుంచి అన్ని పత్రాలు తీసుకుని సరఫరా చేస్తామని వెల్లడించారు.

జీఓ 3పై చట్టం చేయాలి

- ఏఎస్‌పీ రాష్ట్ర అధ్యక్షుడు పూనెం శ్రీనివాస్
- ఇల్లెందు ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం ఎదుట ఆందోళన


ఆందోళన చేస్తున్న నాయకులు

ఇల్లెందు: తెలంగాణలోని ఐదో షెడ్యూల్ ప్రాంతంలో గిరిజనులకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించేలా తీసుకొచ్చిన జీఎం 3ను కొందరు గిరిజనేతరులు కోర్టుకు వెళ్లి అడ్డుకున్నారని.. ఈ జీఓపై రాష్ట్రప్రభుత్వం చట్టం చేయాలని ఆదివాసీ సంక్షేమ పరిషత్(ఏఎస్‌పీ) రాష్ట్ర అధ్యక్షుడు పూనెం శ్రీనివాస్ డిమాండ్ చేశారు. ఈ విషయంలో గిరిజన ప్రజాప్రతినిధులు చొరవ తీసుకోవాలన్నారు. ఈమేరకు సోమవారం ఇల్లెందు మండలంలోని బొజ్జాయిగూడెం సమ్మక్క గద్దెల నుంచి బైక్ ర్యాలీ నిర్వహించి ఎమ్మెల్యే హరిప్రియ క్యాంపు కార్యాలయం వద్ద ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ జీఓ 3ను కొట్టేశాక ప్రభుత్వం రివ్యూ పిటీషన్ దాఖలు చేసిందని, ఉద్యోగ నియామకాల్లో 6శాతం రిజర్వేషన్ ప్రకటించిందన్నారు. అయితే, ఆరు శాతం రిజర్వేషన్ ద్వారా ఏజెన్సీ ప్రాంతంలో ఉద్యోగావకాశాలు కల్పిస్తే ఐదో షెడ్యూల్ పరిధిలోని గిరిజన చట్టాలు ఉల్లంఘనకు గురవుతాయని తెలిపారు. గిరిజనేతరులకు ఉద్యోగావకాశాలు దక్కించుకుని ఆ పేరుతో మైదాన ప్రాంతం నుంచి ఏజెన్సీ ప్రాంతంలోకి వచ్చి భూములు కొనుగోలు చేస్తారని చెప్పారు. ఈమేరకు జీఓ 3పై చట్టం తీసుకొచ్చేలా ప్రజాప్రతినిధులు చొరవ తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఏఎస్‌పీ నాయకులు ఈసాల సురేష్, ఊకె నాగులుస్వామి, పూనెం సారయ్య, చింత ఉపేందర్, పూనెం సురేష్, దనసరి రాజేష్, ప్రకాష్, రామారావు, శివకుమార్, మంకిడి సురేష్, సనప గోవర్ధన్, ఊకె చైతన్య, చాట్ల సంపత్ తదితరులు పాల్గొన్నారు.

సర్వజన ఆస్పత్రిలో సంబరాలు


కేక్ కట్ చేస్తున్న కుమార్‌స్వామి

కొత్తగూడెంరూరల్: జిల్లా సర్వజన ఆస్పత్రిలో విధులు నిర్వహిస్తున్న వైద్యులకు 2016 సంవత్సర ఎరియర్స్ విడుదల కావడంతో పాటు, వైద్యులకు ప్రమోషన్ వచ్చినా సందర్భంగా సోమవారం కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఆస్పత్రి సూపరింటెండెంట్ బోడ కుమార్‌స్వామి మాట్లాడుతూ వైద్యులకు ఎరియర్స్‌తోపాటు, వైద్యులకు పదోన్నతి కల్పించిన సీఎం కేసీఆర్, వైద్య శాఖ మంత్రి హరీశ్‌రావులకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఆర్‌ఎంఓ నాగేశ్వరరావు, ప్రొఫెసర్లు బాలాజీ, రాజ్‌కుమార్, అసిస్టెంట్ ప్రొఫెసర్ సురేందర్, పుష్పలత, నాగదీప్, సారిక, స్వాతి, వెంకటేశ్వరరావు, నాగరాజు, సంతోష్ పాల్గొన్నారు.

ట్రాక్టర్ లాగిన యువకుడు


ట్రాక్టర్ లాగుతున్న కొడెం కృష్ణ

ఇల్లెందు: ఇల్లెందులో పంక్చర్ షాప్ నిర్వహించే యువకుడు కొడెం కృష్ణ ట్రాక్టర్‌కు ట్యూబులు కట్టి సుమారు 500 మీటర్ల మేర లాగి అందరినీ ఆకర్షించాడు. ఈ సందర్భంగా కృష్ణ మాట్లాడుతూ.. కొంత కాలంగా ఈ ప్రయత్నం చేస్తున్నానని, ఎట్టకేలకు సోమవారం 500 మీటర్ల మేర లాగగలిగానని చెప్పాడు. రానున్న కాలంలో ఏదో ఒకచోట పోటీల్లో పాల్గొని గిన్నిస్ బుక్‌లో పేరు నమోదు చేసుకుంటానని చెబుతున్నాడు.

చదువుకున్న పాఠశాలకే ప్రధానోపాధ్యాయుడిగా..


వీరభద్రరావు

సుజాతనగర్ : 1979లో పదో తరగతి పూర్తి చేసిన ఓ విద్యార్థి.. ఇప్పుడు అదే పాఠశాలకు ప్రధానోపాధ్యాయుడిగా వచ్చిన అరుదైన ఘటన సుజాతనగర్‌లో చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన చిట్లూరి వీరభద్రరావు 1 నుంచి 10వ తరగతి వరకు స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చదువుకున్నారు. 1989లో ప్రభు త్వ ఉపాధ్యాయుడిగా ఉద్యోగం రాగా, మొదట ఏపీలోని కూనవరంలో విధుల్లో చేరారు. ఆ తర్వాత మామునూరు, జూలూరుపాడు హైస్కూళ్లలో ఉపాధ్యాయుడిగా పనిచేశారు. 2015లో సుజాతనగర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు స్కూల్ అసిస్టెంట్‌గా బదిలీపై వచ్చారు. ఆ తర్వాత బదిలీ అయిన వీరభద్రరావు తిరిగి ప్రధానోపాధ్యాయుడిగా సుజాతనగర్ ఉన్నత పాఠశాలలో పోస్టింగ్ ఇస్తూ వరంగల్ ఆర్జేడీ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు.

సైబర్ మోసాలపై అవగాహన ఉండాలి

కొత్తగూడెం డీఎస్పీ అబ్దుల్ రెహమాన్


ఆటోకు ఫ్లెక్సీ ఏర్పాటు చేసి ప్రచారం చేస్తున్న పోలీసులు

కొత్తగూడెంటౌన్: సైబర్ మోసాలపై ప్రతి ఒక్కరికీ అవగాహన ఉండాలని కొత్తగూడెం డీఎస్పీ అబ్దుల్ రెహమాన్ అన్నారు. స్థానిక బస్టాండ్‌సెంటర్‌లోని ఆటో స్టాండ్ వద్ద వన్‌టౌన్ సీఐ కరుణాకర్, ట్రాఫిక్ ఎస్సై నరేష్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ప్రచార రథాన్ని(ఆటో) సోమవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. సైబర్ మోసాల బారిన పడకుండా ప్రజలను చైతన్యం చేసేందుకు ఎస్పీ డాక్టర్ వినీత్ ఆదేశాల మేరకు ఈ కార్యక్రమం చేపట్టినట్లు తెలిపారు. ఆటోలపై ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలతో ప్రజలకు మరింత అవగాహన కలుగుతుందన్నారు. సైబర్ నేరగాళ్లు కొత్త పద్ధతుల్లో ప్రజల బ్యాంకు ఖాతాల్లో నుంచి సొమ్ము కాజేసేందుకు కుట్రలు చేస్తున్నారని తెలిపారు. వ్యక్తిగత వివరాలు చెప్పమంటూ బ్యాంకర్ల పేరుతో కొందరు ఇతర వ్యక్తులు ఫోన్ చేస్తున్నారని, ఆధార్, బ్యాంకు ఖాతా నంబర్ వంటి సమాచారం ఇవ్వొద్దని సూచించారు. ఎవరైనా సైబర్ మోసాలకు గురైతే వెంటనే డయల్ 100కు సమాచారం అందించాలని కోరారు. కార్యక్రమంలో కొత్తగూడెం టూటౌన్, త్రీటౌన్ సీఐలు రమేష్‌కుమార్, మురళి, ఎస్సై విజయ, కానిస్టేబుల్ ఘని, ఆటో యూనియన్ నాయకులు చిట్టూరి భాస్కర్, జోసఫ్, నిరంజనం, దుర్గరాజు పాల్గొన్నారు.

మావోయిస్టుల జాడ తెలిస్తే చెప్పండి

గుండాల, మణుగూరు సీఐలు రవీందర్, బాలాజీ వరప్రసాద్


మణుగూరులో వాల్‌పోస్టర్ అతికిస్తున్న పోలీసులు

ఇల్లెందురూరల్/మణుగూరు టౌన్/దుమ్ముగూడెం : మావోయిస్టుల జాడ తెలిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని గుండాల సీఐ రవీందర్, మణుగూరు సీఐ బాలాజీ వరప్రసాద్, దుమ్ముగూడెం సీఐ దోమల రమేష్ పిలుపునిచ్చారు. మావోయిస్టు నాయకులు కొయ్యాడ సాంబయ్య అలియాస్ అజాద్, గజేందర్ అలియాస్ మధు, పొట్టం సంకి అలియాస్ అరుణ, కురసం మంగు అలియాస్ భద్రు, కుంజా వీరయ్య అలియాస్ లచ్చన్న, మంగ్లు, దీపక్, చిలక, వెట్టి దేవ అలియాస్ బాలు ఫొటోలతో కూడిన వాల్‌పోస్టర్లను సోమవారం వారు విడుదల చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. అభివృద్ధిని అడ్డుకుంటున్న మావోయిస్టులను గ్రామాల్లోకి రాకుండా చూడాలని ప్రజలకు సూచించారు. మావోయిస్టుల సమాచారం అందించిన వారికి.. ఆయా మావోయిస్టులపై ప్రభుత్వం విధించిన రివార్డులను బహుమతిగా ఇస్తామని ప్రకటించారు. సంఘ విద్రోహ శక్తులకు ఎవరైనా సహకరిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఆయా కార్యక్రమాల్లో కొమరారం ఎస్సై గిరిధర్‌రెడ్డి, మణుగూరు ఎస్సై శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

జనారణ్యంలోకి చుక్కల దుప్పి


దుప్పితో స్థానికులు

సత్తుపల్లిటౌన్: ఓ చుక్కల దుప్పి సోమవారం జనారణ్యంలోకి రాగా, స్థానికులు బంధించి అటవీ శాఖ అధికారులకు అప్పగించారు. సత్తుపల్లిలోని పాల కేంద్రం వెనుకాల ఉన్న అర్బన్ పార్క్ ఫెన్సింగ్ – డ్రెయినేజీ నడుమ కొంత ఖాళీ ఉండటంతో అందులో నుంచి రెండు చుక్కల దుప్పులు బయటకు వచ్చాయి. ఇందులో ఓ దుప్పి పిల్ల వెనక్కి వెళ్లిపోయినా, ఇంకొకటి మాత్రం రోడ్డు దాటి గాంధీనగర్‌లోని జనవాసాల్లోకి వచ్చింది. దీంతో స్థానికులు దాన్ని బంధించి స్థానిక బీట్ ఆఫీసర్ ఎం వెంకటేశ్వర్లుకు అప్పగించారు. అనంతరం దుప్పిని అర్బన్ పార్క్‌లో వదిలేసినట్లు బీట్ ఆఫీసర్ తెలిపారు.


ట్రాక్టర్ బ్యాటరీలు చోరీ

దుమ్ముగూడెం : మండలంలోని బుర్రవేముల, వర్క్‌షాప్ గ్రామాల్లోని ట్రాక్టర్, ఆటోలకు చెందిన 5 బ్యాటరీలను ఆదివారం అర్ధరాత్రి గుర్తుతెలియని వ్యక్తులు చోరీ చేశారు. గతంలో కూడా మండలంలోని పలు గ్రామాల్లో ఈ తరహా చోరీలు జరగగా పోలీసులు నిఘా ఏర్పాటు చేశారు. అయినా చోరీలు జరుగుతూనే ఉండడంతో ప్రజలు ఆందోళనకు గురవుతున్నారు. వ్యవసాయ సీజన్‌లో ట్రాక్టర్ బ్యాటరీలు చోరీకి గురైతే ఆర్థికభారంతో సాగు పనులకు ఆటంకం కలుగుతుందని, పోలీసులు రాత్రి వేళల్లో పెట్రోలింగ్ పెంచాలని పలువురు కోరుతున్నారు.

గల్లంతైన వైద్యుడి మృతదేహం లభ్యం

పాల్వంచ : సరదాగా ఈతకు వెళ్లి ముర్రేడు వాగులో గల్లంతైన ఆర్‌ఎంపీ వైద్యుడి మృతదేహం సోమవారం లభ్యమైంది. పోలీసుల కథనం మేరకు.. పట్టణంలోని మంచికంటినగర్‌కు చెందిన పాలగడి రమేశ్(35) సంగారెడ్డిలో ఆర్‌ఎంపీగా పనిచేస్తున్నాడు. తల్లిని చూసేందుకు పాల్వంచకు వచ్చిన రమేశ్ ఆదివారం బావమరిది మురళితో కలిసి ముర్రేడు వాగులో ఈతకు వెళ్లాడు. వాగులో సుడిగుండం ఉండడంతో అందులో కూరుకుపోయి గల్లంతయ్యాడు. కాగా రమేష్ మునిగిన ప్రదేశంలోనే సోమవారం మృతదేహం పైకి తేలుతూ కనిపించింది. గుర్తించిన స్థానికులు పోలీసుల సమక్షంలో బయటకు తీయగా, పోస్టుమార్టం నిమిత్తం స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మృతుడికి భార్య సంధ్య, కుమారుడు, కూతురు ఉన్నారు.

పురుగులమందు తాగి రైతు ఆత్మహత్య


సత్యనారాయణ (ఫైల్)

జూలూరుపాడు: జూలూరుపాడు గ్రామానికి చెందిన ఓ రైతు పురుగుమందు తాగి ఆత్మహత్య చేసుకున్న ఘటన సోమవారం చోటుచేసుకుంది. ఎస్ఐ బి. పురుషోత్తం తెలిపిన వివరాల ప్రకారం మండల కేంద్రానికి చెందిన చిలుకూరి సత్యనారాయణ(57) కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. కుటుంబసభ్యులు పలుమార్లు ఆస్పత్రికి తీసుకెళ్లినా పరిస్థితి మెరుగుపడలేదు. ఈ క్రమంలో మనస్తాపానికి గురైన సత్యనారాయణ సోమవారం మధ్యాహ్నం పొలానికి వెళ్లి అక్కడే పురుగుమందు తాగాడు. గమనించిన కుటుంబసభ్యులు కొత్తగూడెం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడికి భార్య బేబి, కుమార్తె కవిత, కుమారుడు కిరణ్ ఉన్నారు. కిరణ్ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

పోలీసుస్టేషన్ ఆవరణలో ఆత్మహత్యాయత్నం

ఘర్షణ కేసులో విచారణకు తీసుకురాగా ఘటన

దుమ్ముగూడెం: పోలీస్‌స్టేషన్ ఆవరణలో ఇద్దరు పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డారు. మండలంలోని ఆంధ్రకేసరి నగర్ గ్రామానికి చెందిన నాగమణి, సమ్మక్కకు మధ్య వాగ్వాదం జరిగింది. దీంతో సమ్మక్కపై నాగమణి సోమవారం పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈమేరకు సమ్మక్కను పిలిపించిన పోలీసులు విచారిస్తుండగా.. ఆమెతో పాటు వెంట వచ్చిన సందీప్ తమపై అక్రమంగా కేసు నమోదు చేశారని ఆరోపిస్తూ పీఎస్ ఆవరణలో వెంట తెచ్చుకున్న పురుగుల మందు తాగారు. దీంతో పోలీసులు అప్రమత్తమై వారిని ములకపాడు ఆస్పత్రికి, అక్కడి నుంచి 108లో భద్రాచలం ఏరియా ఆస్పత్రికి తరలించారు.